క్లుప్తంగా

గ్రామకంఠ భూముల సర్వే పరిశీలన


భూముల సర్వేను పరిశీలిస్తున్న ఏడీ గౌష్‌బాష

హనుమంతునిపాడు: మండల పరిధిలోని తిమ్మారెడ్డిపల్లి గ్రామ రెవెన్యూ పరిధి ఎలికవారిపల్లి, వెంగపల్లి గ్రామాల్లో జరుగుతున్న గ్రామ కంఠ భూముల సర్వేను జిల్లా స్వామిత్వ సర్వే ఏడీ షేక్ గౌష్‌బాషా బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామ కంఠ భూములను మ్యాప్ పరిశీలించారు. ఏ నంబర్‌లో గ్రామ కంఠ భూములు ఎంత ఉందని తహసీల్దార్ నాగూర్ మీరావలిని అడిగి తెలుసుకున్నారు. జరుగుతున్న సర్వేను పరిశీలించి గ్రామ కంఠ భూములు సర్వే జాగ్రత్తగా నిర్వహించాలన్నారు. సర్వే విరాలు జిల్లా స్వామిత్వ సర్వే శాఖకు అందించాలన్నారు. ఆర్ఐ జి.కృష్ణ చైతన్య, సర్వేయర్లు, వీఆర్ఓలు పాల్గొన్నారు.

పారిశుధ్య సిబ్బందికి దుస్తుల పంపిణీ


పారిశుధ్య సిబ్బందికి దుస్తులు పంపిణీ చేస్తున్న చైర్మన్ గఫార్

కనిగిరిరూరల్: ఆర్ఎంపీ వైద్యులు ఎస్‌కే ఖాజావలి(బాషా) వర్ధంతిని పురస్కరించుకొని సేవాహిత కార్యక్రమాలు నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు, అనాథలకు, అన్నదాన కార్యక్రమం చేశారు. పేదలకు, పారిశుధ్య కార్మికుల దుస్తులు పంపిణీ చేశారు. తొలుత ఖాజావలి చిత్రపటానికి పూల మాలల వేసి నివాళులర్పించారు. ఆర్ఎంపీలు ఎస్‌కే ఖాజా హుస్సేన్, కుటుంబసభ్యులు, న్యాయవాదులు ఎస్‌కే సుమైర్, ఎస్‌కే జలీల్, హబీబ్, మస్తాన్ షరీఫ్, సమీర్ హుస్సేన్, తన్వీన్ షాహీద్, ఎస్‌కే ఖాజా రంతుల్లా, ఎస్‌కే సుహేల్, పీర్ బాషా, అబ్దుల్, మస్తాన్, వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, బీసీ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఎరువులు అక్రమంగా నిల్వ ఉంచితే చర్యలు


తనిఖీ చేస్తున్న వ్యవసాయాధికారి, ఎస్సై

పీసీపల్లి: ఎరువులను అక్రమంగా నిల్వ ఉంచి కొరత సృష్టిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని వ్యవసాయాధికారి రంగకృష్ణ అన్నారు. స్థానికంగా రెండు ఎరువుల దుకాణాలను ఎస్సై కోటయ్యతో కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎరువులను నిల్వ చేసినా, అధిక ధరలకు విక్రయించినా షాపులు సీజ్ చేస్తామని హెచ్చరించారు. రైతులు కూడా ఎక్కడైనా అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు తెలిస్తే సమాచారం ఇవ్వాలని కోరారు.

సచివాలయ సిబ్బందికి మెమోలు జారీ

కనిగిరిరూరల్: మండలంలోని చల్లగిరిగిల్ల సచివాలయాన్ని ఎంపీడీఓ ప్రభాకర్‌శర్మ బుధవారం ఆకస్మిక తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. బయోమెట్రిక్ అటెండెన్స్ సకాలంలో వేయని సిబ్బంది మెమో జారీ చేశారు. విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవన్నారు. సచివాలయ సిబ్బందికి, అధికారులు సూచనలు సలహాలు ఇచ్చారు. గ్రామంలో జరుగుతున్న స్వామిత్వ కార్యక్రమాన్ని పరిశీలించి సూచనలు చేశారు.

మలుపుల్లో ఐరన్ రైలింగ్ వాల్స్ ఏర్పాటు

సాక్షి ఎఫెక్ట్..

కనిగిరిరూరల్: పట్టణానికి అనుకొని నేషనల్ హైవే నూతన రోడ్డు నిర్మాణం పనులు దాదాపు పూర్తయ్యాయి. ఈ క్రమంలో రెండు జంక్షన్ పాయింట్ల వద్ద ఉన్న అప్రోచ్ రోడ్డులు, మలుపులు, కాలువలు ప్రమాదభరితంగా మారాయి. ప్రధానంగా మలుపుల వద్ద సెఫ్టీ వాల్స్, ఇరన్ వాల్స్, ఐరన్ రైలింగ్స్ ఏర్పాటు చేయలేదు. దీంతో రోడ్డుపై ప్రయాణం ప్రమాద ఘంటికలు మోగిస్తుండటంపై 'మలుపులు.. కాటికి పిలుపులు' అనే శీర్షికతో సాక్షిలో కథనం ప్రచురితమైంది. స్పందించిన హైవే అధికారులు రోడ్డుకు ఇరు వైపులా సెఫ్టీ వాల్స్ ఏర్పాటు చేశారు.


రోడ్డుకు ఇరువైపుల ఏర్పాటు చేసిన ఐరన్ రైలింగ్ వాల్స్

పొగాకు మిగులు.. రైతుకు దిగులు

- కనిగిరి బోర్డు పరిధిలో 3.2 మిలియన్ కేజీల పొగాకు పంట మిగులు
- రెండో విడత వేలం ప్రారంభించాలని రైతు సంఘాల డిమాండ్
- ఇప్పటికే బ్యారన్‌కు రూ.లక్షల్లో నష్టాలు
- మిగులు పొగాకు ఏం చేయాలో తెలియక రైతుల ఆందోళన


పొగాకు బేళ్ల నిల్వలు


పొగాకు బేళ్లు

కనిగిరిరూరల్: పొగాకు రైతు ఈ ఏడాది కుదేలయ్యాడు. బయ్యర్లతో కూటమి ప్రభుత్వ లాలూచి.. కొరవడిన పర్యవేక్షణ, బోర్డు అధికారుల నిర్లక్ష్యం.. వెరసి పొగాకు రైతులు నిలువునా మునిగిపోయారు. వేలం ప్రారంభం నుంచి మద్దతు ధర లేక రైతులు రోడ్డెక్కినా ప్రభుత్వం పట్టించుకోలేదు. ఇప్పుడు వేలంముగిసింది. ఇప్పటికే రైతులు లక్షల్లో నష్టాన్ని మూటగట్టుకున్నారు. ఈ పరిస్థితుల్లో మిగిలిన పొగాకు ఏం చేయాలో తెలియక తల్లడిల్లుతున్నారు.

3.2 మిలియన్ కేజీలు మిగులు

కనిగిరి పొగాకు బోర్డు పరిధిలో పొగాకు సాగు విస్తీర్ణం 4,952 హెక్టార్లు . ఈ ఏడాది పొగాకు ఉత్పత్తి 8.5 మిలియన్ కేజీలు ఉత్పత్తి దిగుబడి వచ్చింది. అయితే ఆగస్టు చివరి వారం వరకు 5.3 మిలియన్ కేజీల పొగాకు కొనుగోళ్లు చేశారు. కా 3.2 మిలియన్ కేజీలు పొగాకు అన్ని రకాల గ్రేడ్‌లు మిగిలి ఉన్నాయి. లో గ్రేడ్‌తో పాటు, నెంబర్ గ్రేడ్(గ్రేడ్ 1, గ్రేడ్ 2) రకాలు కూడా రైతుల ఇళ్లల్లోనే మగ్గుతున్నాయి. పొగాకు వేలం ముగిసిన నాటికి కనిష్ట ధర రూ.140 వరకు మాత్రమే పలికింది. గరిష్ట ధర రూ 290–రూ 300 లకు దాటలేదు.

అలవలపాడు క్లస్టర్ పరిధిలో అధికంగా..

నియోజకవర్గంలోని అన్ని క్లస్టర్‌లోని రైతుల వద్ద పొగాకు పంట మిగులు ఉన్నా.. పీసీపల్లి మండలం అలవలపాడు క్లస్టర్ పరిధిలో ఎక్కువగా పొగాకు నిల్వలు ఉన్నాయి. ఆ క్లస్టర్ పరిధిలో సుమారు 7 గ్రామాల వరకు ఉన్నాయి. సగానికి పైగా ఆ క్లస్టర్ పరిధిలోని పంట మిగులు ఉన్నట్లు అంచనా. ప్రతి రైతు తక్కువగా అంటే 20 క్వింటాళ్ల వరకు పొగాకు మిగులు ఉన్నట్లు తెలిసింది.

వేలం వెంటనే ప్రారంభించాలి:



ప్రభుత్వం రైతు వద్ద మిగులు ఉన్న పొగాకు పంట మొత్తాన్ని కొనుగోలు చేయాలి. పొగాకు రైతుకు గిట్టు బాటు ధర కల్పించాలి. ప్రతి రైతు ఇంట్లో కనీసం 20 క్వింటాళ్ల పొగాకు నిల్వ ఉంది. పొగాకు రైతులపై ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరిని విడనాడాలి. అన్ని రకాల లోగ్రేడ్ పంటను కొనుగోలు చేయాలి. పొగాకు వేలాన్ని మళ్లీ వెంటనే కనిగిరిలో ప్రారంభించాలి.

– గుజ్జుల బాలిరెడ్డి, ఏపీ రైతు సంఘం నియోజకవర్గ కార్యదర్శి

100 క్వింటాల్ల పొగాకు నిల్వ ఉంది



మా కుటుంబంలో 5 లైసెన్స్ బ్యార్నీలు ఉన్నాయి. సుమారు 300 క్వింటాళ్ల పొగాకు ఉత్పత్తి వచ్చింది. గతేడాది 2023– 24లో పొగాకుకు మంచి ధరలు పలకడంతో.. ఏడాది 2025లో పొగాకునే అంతా సాగు చేశాం. పెట్టుబడులు కూడా పెరిగాయి. దాదాపు 300 క్వింటాళ్లు పొగాకు దిగుబడి వచ్చింది. అయితే 200 క్వింటాళ్లు మాత్రమే కొనుగోలు చేశారు. అది కూడా గిట్టు బాటు ధర లేదు. మంచి గ్రేడ్ పొగాకు కూడా కేజీ రూ. 270, రూ. 280 మించి ఇవ్వలేదు. దీంతో తీవ్రంగా నష్టపోయాం. ఇప్పుడు సుమారు 100 క్వింటాళ్ల మిగులు పంట దిగుబడి మిగిలింది. ఇంతలోనే వేలం నిలిపివేశారు. పొగాకు ధరలు పెంచి, మళ్లీ వేలం ప్రారంభించి కొనుగోలు చేయాలి. కూటమి ప్రభుత్వంలో పొగాకు రైతుకు తీవ్రంగా నష్టపోయే పరిస్థితి నెలకొంది.

– గుంటూరి వెంకటేశ్వర్లు, దిరిశవంచ, కనిగిరి మండలం

మిగులు పంటను కొనుగోలు చేయాలి



పొగాకు రైతుల ఇళ్లల్లో ఉన్న మిగులు పంటను పూర్తిగా ప్రభుత్వం, బోర్డు అధికారులు కొనుగోలు చేయాలి. ఈ ఏడాది రైతుకు గిట్టు బాటు ధర లేదు. పంట మిగులతో రైతులు అల్లాడుతున్నారు. తెచ్చిన పెట్టుబడులకు వడ్డీలు కట్టలేక అల్లాడుతున్నారు. రైతుకు సరైన మద్దతు ధరతో తిరిగి వేలాన్ని ప్రారంభించి కొనుగోలు చేయాలి. రైతు పండించిన అదనపు పంటకు కేంద్ర ప్రభుత్వం అపరాధ రుసుం లేకుండా రద్దు చేయాలి. లోగ్రేడ్ పంటకు మంచి గిట్టు బాటు ధరను కల్పించి కొనుగోలు చేయాలి.

– సూరసాని మోహన్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ రైతు సంఘ రాష్ట్ర కార్యదర్శి

పదోన్నతి పొందిన వైద్యులకు సన్మానం


వైద్యులను సన్మానిస్తున్న చైర్మన్ గఫార్, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెంకట సుబ్బయ్య

కనిగిరిరూరల్: స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో విధులు నిర్వహిస్తూ సివిల్ అసిస్టెంట్ సర్జన్ నుంచి డిప్యూటీ సివిల్ సర్జన్‌గా పదోన్నతి పొందిన డాక్టర్ ఆయోషా, డెంటల్ అసిస్టెంట్ సర్జన్ నుంచి డిప్యూటీ డెంటల్ సర్జన్‌గా పదోన్నతి పొంది డాక్టర్ కుసుమలను బుధవారం కేఎస్ఎం ఎడ్యుకేషనల్ సొసైటీ, గుడ్ హెల్ప్ ఫౌండేషన్ సంస్థల ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కెఎస్ఎం చైర్మన్, మున్సిపల్ చైర్మన్ గఫార్, ఆస్పత్రి సూపరిండెంట్ డాక్టర్ వెంకట సుబ్బయ్య మాట్లాడుతూ నిరంతర సేవలు, అంకిత భావంతో పనిచేసే వారికి తప్పక గుర్తింపు, గౌరవం దక్కుతుందన్నాఉ. కార్యక్రమంలో ప్రతినిధులు మంద్రు రమేష్, థెరిస్సా సేవాసమితి అధ్యక్షుడు ఎస్‌డీ నాయబ్ రసూల్, ఎస్‌కే షరీఫ్, న్యాయవాది సుమైర్, ఆర్ఎంపీ వైద్యులు ఎస్‌కే ఖాజా హుస్సేన్, పచ్చవ చంద్ర శేఖర్, నాగూర్‌బీ, ఎల్ఐసీ నారాయణ, నాదేళ్ల నరసింహారావు, తదితరులు పాల్గొన్నారు.

ఆశా కార్యకర్తలకు కనీస వేతనం ఇవ్వాలి

హనుమంతునిపాడు: ఆశావర్కర్లకు, అంగన్‌వాడీ కార్యకర్తలకు, కుకింగ్ ఏజెన్సీలు, ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్లకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు మాలకొండయ్య డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు బడుగు వెంకటేశ్వర్లు, మాలకొండయ్య మాట్లాడుతూ సమస్యలు పరిష్కరించి శ్రమకు తగిన వేతనాలు ఇవ్వాలన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత


విద్యార్థులకు పత్రాలు అందజేస్తున్న చైర్మన్, కమిషనర్, ఎంఈఓ

కనిగిరిరూరల్: పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్, కమిషనర్ పి. కృష్ణ మోహన్‌రెడ్డి అన్నారు. స్థానిక జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో స్వచ్ఛంధ్రా, వివిధ సంస్థల ఆధ్వర్యంలో పేపర్ రీ సైక్లింగ్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. హెచ్ఎం కలువ విజయలక్ష్మి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో చైర్మన్ గఫార్ మాట్లాడుతూ పేపర్ రీసైక్లింగ్ అంటే పర్యావరణ అని ప్రతి ఒక్కరిలో అవగాహన కల్గి ఉండాలన్నారు. రోజువారి జీవితంలో పేపర్ వాడకం విస్తృతంగా ఉండటం వల్ల వాడిన పేపర్‌ను చెత్తలో పారేయకుండా రీ సైక్లింగ్ చేయడం వల్ల అడవులను కాపాడటమే కాకుండా నీరు, విద్యుత్ వంటి విలువైన వనరులు కూడా ఆదా చేయవచ్చని వివరించారు. పనికిరాని పాత పుస్తకాలు, పేపర్స్, సేకరించి రీ సైక్లింగ్‌కు అందించిన విద్యార్థులకు రీసైక్లింగ్ ఛాంపియన్‌గా ప్రథమ, ద్వితీయ, తృతీయ ప్రోత్సాహక పత్రాలు, మెడల్స్ ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఎంఈఓ యువీ నారాయణరెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ నాయబ్ రసూల్, వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు ఎలీషా, పవన్, రమేష్‌బాబు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలు అమ్మఒడి లాంటివి


సామూహిక అన్న ప్రాసన చేస్తున్న సూపర్‌వైజర్

సీఎస్‌పురం(పామూరు): అంగన్‌వాడీ కేంద్రాలు అమ్మఒడి లాంటివని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కె.దేవకృపావరం అన్నారు. మండలంలోని ఆనికాలపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం కేంద్రంలోని చిన్న పిల్లలకు సామూహిక అన్నప్రాసన నిర్వహించారు. ఈసందర్భంగా సూపర్‌వైజర్ కృపావరం మాట్లాడుతూ 3 నుంచి ఆరేళ్ల వయసు లోపు పిల్లలందరినీ తల్లిదండ్రులు విధిగా అంగన్‌వాడీ కేంద్రాలకు పంపాలన్నారు. స్థానిక ఎంపీపీఎస్ హెచ్‌యం జె.భారతి, ఉపాధ్యాయురాలు, నారాయణం అలేఖ్య తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ పథకాలు అందేలా చూడాలి


మాట్లాడుతున డీఎల్‌డీఓ శ్రీనివాసరెడ్డి

పామూరు: అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందేలా చూడాలని డీఎల్‌డీఓ కె.శ్రీనివాసరెడ్డి అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం మండలస్థాయి అధికారులతో కోఆర్డినేషన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తల్లికి వందనం, పాఠశాల తనిఖీలు, కౌశలం, వివిధ పథకాలపై సమీక్షించారు. సచివాలయాల వారీగా వివిధ శాఖలకు సంబంధించి సమస్యల పరిష్కారం కోసం వచ్చిన అర్జీలు పెండింగ్ లేకుండా తక్షణం పరిష్కరించేలా చూడాలన్నారు. మండలంలో తాగునీరు, పాఠశాలల పరిస్థితి, ఉపాధ్యాయుల కొరత, అంగన్‌వాడీ కేంద్రాల పనితీరు ఇతర శాఖల పనితీరుపై సమీక్షించి సూచనలు చేశారు. ఎంపీడీఓ ఎల్.బ్రహ్మయ్య, డిప్యూటీ ఎంపీడీఓ కే.సుందరరామయ్య, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు గోళ్ల పద్మజ, పార్వతి, ఏఈ మస్తాన్‌వలి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రమేష్, ఎంఈఓ కరుణకుమారి, ఏపీఎం విద్యాసాగర్ పలుశాఖల అధికారులు పాల్గొన్నారు.

సీఎస్‌పురం(పామూరు): అధికారులు ప్రజాసమస్యల పరిష్కారమే లక్ష్యంగా సమన్వయంతో పనిచేయాలని మండల ప్రత్యేకాధికారి, ఎల్‌డీఓ కె.శ్రీనివాసరెడ్డి అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం వివిధశాఖల మండలస్థాయి అధికారులతో ప్రభుత్వ పథకాలు, ప్రజాసమస్యల పరిష్కారం, తల్లికివందనం, ఇతర అంశాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో తాగునీటి సమస్యలు, పారిశుధ్య సమస్యలు లేకుండా చూడాలన్నారు. విద్యుత్ సమస్యలు తలెత్తకుండా చూడాలని సూచించారు. ఎంపీడీఓ ఎల్.బ్రహ్మయ్య, డిప్యూటీ ఎంపీడీఓ రమణయ్య, ఎంఈఓ జె.ప్రసాదరావు, వివిధ శాఖల మండల అధికారులు పాల్గొన్నారు.

మోసం చేయడంలో చంద్రబాబు దిట్ట


పెద్దకండ్లగుంటలో బాబు ష్యూరిటీ, మోసం గ్యారంటీ క్యూ ఆర్ కోడ్ ఆవిష్కరిస్తున్న నేతలు

కొండపి: హామీలు అమలు చేయకుండా ప్రజలను మోసం చేయడంలో చంద్రబాబు దిట్ట అని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ బచ్చల కోటేశ్వరరావు అన్నారు. మండలంలోని పెద్ద కండ్లగుంటలో నియోజకవర్గ ఇంటలెక్చువల్ అధ్యక్షుడు, గ్రామ సర్పంచ్ భువనగిరి సత్యనారాయణ అధ్యక్షతన బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నికల సమయంలో వలంటీర్లకు రూ.10 వేల వేతనం ఇస్తామని హామీ ఇచ్చి వారిని రోడ్డున పడేశారన్నారు. ప్రజలు మేలు చేయడం చంద్రబాబు చరిత్రలో లేదన్నారు. లక్షల ఉద్యోగాలు సృష్టిస్తానని తెలిపి ఉన్న ఉద్యోగాలు ఊడబీకుతున్నారని, నిరుద్యోగులకు జాబు వచ్చే వరకు నిరుద్యోగ భృతి ఇస్తానని చెప్పి 15 నెలలైనా ఇప్పటి వరకు దాని ఊసే లేదన్నారు. హామీలు అమలు చేయకుండా రెడ్‌బుడ్ రాజ్యాంగాన్ని ఉపయోగిస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని మండిపడ్డారు.

ప్రజలంతా కూటమి ప్రభుత్వ మోసాలను తెలుసుకోవాలని సూచించారు. అనంతరం బాబు ష్యూరిటీ..మోసం గ్యారంటీ క్యూ ఆర్ కోడ్‌ను ఆవిష్కరించారు. తొలుత వైఎస్సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి అన్నదానం చేశారు. ఎంపీటీసీ బొల్లా సుబ్బారావు, సీనియర్ నాయకులు రాఘవరావు, రామయ్య, వెంకటరావు మాధవరావు, లక్ష్మీనరసయ్య, కార్తీక్, ఎస్సీ సెల్ నాయకుడు నల్లపు మాల్యాద్రి తదితరులు పాల్గొన్నారు.

సీఐటీయూ మహాసభలను జయప్రదం చేయాలి



మాట్లాడుతున్న తిరుపతిరెడ్డి


సీఎస్‌పురం(పామూరు): స్థానిక ఎంఎస్ఆర్ జూనియర్ కళాశాలలో ఈనెల 7న జరగనున్న మండల మహాసభను జయప్రదం చేయాలని సీఐటీయూ మండల గౌరవాధ్యక్షుడు తిరుపతిరెడ్డి పేర్కొన్నారు. స్థానిక కార్యాలయంలో బుధవారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఉద్యోగులు, కార్మికుల సమస్యలపై నిరంతరం పోరాడే ఏకైక సంఘం సీఐటీయూ అన్నారు. మండల మహాసభకు కార్మికులు, స్కీం వర్కర్లు పెద్దసంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీయం మండల కార్యదర్శి ఊసా రాజ్యలక్ష్మి, కార్మికులు పాల్గొన్నారు.

ఫిర్యాదుదారులతో మర్యాదగా వ్యవహరించాలి


రికార్డులు పరిశీలిస్తున్న డీఎస్పీ సాయి ఈశ్వర్ యశ్వంత్

కొండపి: పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారుల పట్ల మర్యాదగా వ్యవహరించాలని కనిగిరి డీఎస్పీ సాయి ఈశ్వర్ యశ్వంత్ అన్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌ను వార్షిక తనిఖీలలో భాగంగా బుధవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్టేషన్ కు వచ్చే ప్రతి ఒక్కరితో మర్యాదగా నడుచుకోవాలని, పెండింగ్ కేసులను త్వరగా పరిష్కరించాలని సూచించారు. సిబ్బంది పనితీరును వివరంగా అడిగి తెలుసుకున్నారు. ప్రజలతో ఫ్రెండ్లీ పోలీసింగ్ వ్యవస్థ కలిగి ఉండాలని సూచించారు. అసాంఘిక కార్యకలాపాలపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. స్టేషన్ పరిసరాలను, రిజిస్టర్లను, కేసు డైరీ, పెండింగ్ కేసులు, రికార్డుల సంరక్షణ తదితర అంశాలను పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రజల భద్రత, సమస్యలపై ముందుండి పోలీసింగ్ వ్యవస్థపై ప్రజలకు నమ్మకం కలిగించాలని అన్నారు. ముందుగా సిబ్బందితో డ్రిల్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో కొండపి సీఐ సోమశేఖర్, ఎస్సై ప్రేమ్‌కుమార్, ఏఎస్సై అంకారావు, హెడ్‌కానిస్టేబుల్ సుధాకర్, అనీల్ పాల్గొన్నారు.

పనుల కల్పనలో అలసత్వం వద్దు


మాట్లాడుతున్న డీఎల్‌డీఏ కే.శ్రీనివాసరెడ్డి

పామూరు: జాబ్ కార్డులు ఉన్న ప్రతి ఒక్కరికీ ఉపాధి పనులు కల్పించాలని డీఎల్‌డీఓ కె.శ్రీనివాసరెడ్డి అన్నారు. స్థానిక మండల పరిషత్ సమావేశహాలులో బుధవారం డీఎల్‌డీఓ శ్రీనివాసరెడ్డి టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి పనుల కల్పనలో అలసత్వాన్ని సహించమన్నారు. ఇంకుడు గుంతలు, హార్టీకల్చర్ మొదలైన ఉపాధి పథకాలపై సమీక్షించారు. ఉపాధి సిబ్బందిపై ఆరోపణలు వస్తే ఉపేక్షించేది లేదన్నారు. మస్టర్లు, పనుల కొలతల నమోదులో తేడాలు లేకుండా చూడాలన్నారు. నిర్దేశించిన లక్ష్యాలను సకాలంలో పూర్తయ్యేలా చూడాలని ఏపీఓకు సూచించారు. ఎంపీడీఓ ఎల్.బ్రహ్మయ్య, ఏపీఓ బి.మాల్యాద్రి, టీఏ, ఎఫ్ఏలు పాల్గొన్నారు

ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపిక


వైవీ సుబ్బారావు


జి.వెంకటేశ్వర్లు


జె.భారతి


టి.శ్రీనివాస్ ప్రసాద్


ఈ శ్రీనివాసులు

సీఎస్‌పురం(పామూరు): మండలంలోని ముగ్గురు ఉపాధ్యాయులు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎన్నికయ్యారు. వీరు ఈనెల 5వ తేదీ శుక్రవారం ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఒంగోలులో జిల్లా విద్యాశాఖాధికారి చేతులమీదుగా ప్రశంసాపత్రం, మెడల్ అందుకోనున్నారు. నల్లమడుగుల జెడ్పీహెచ్ఎస్ స్కూల్ అసిస్టెంట్ (ఫిజిక్స్) వైవీ సుబ్బారావు, డీజీపేట జెడ్పీహెచ్ఎస్ స్కూల్ అసిస్టెంట్ (గణితం) జి.వెంకటేశ్వర్లుతో పాటు ఎంపీపీఎస్ ఆనికాలపల్లి ఎస్‌జీటీ జె.భారతిలు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎన్నికయ్యారు. వారికి ఎంఈఓలు జె.ప్రసాదరావు, రాజాల కొండారెడ్డి, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

కొండపి: జిల్లా ఉపాధ్యాయునిగా కొండపికి చెందిన టి.శ్రీనివాస ప్రసాద్ ఎన్నికయ్యారు. నెన్నూరుపాడు ఎంపీయూపీఎస్‌లో ఉపాధ్యాయునిగా పనిచేస్తున్నారు.

మర్రిపూడి: మండలంలోని తంగెళ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల తెలుగు పండిట్ ఎలిక శ్రీనివాసరావు, కూచిపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఎం సురేష్ జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు. వీరిని ఎంఈఓలు రంగయ్య, శ్రీనివాసరావు అభినందించారు.

కోటపాటి తిరుపతిరెడ్డి మృతికి నివాళి

కనిగిరిరూరల్:

దివంగత సీపీఐ మాజీ ఎమ్మెల్యే కోటపాటి గురుస్వామిరెడ్డి తమ్ముడు, వీసీఏ హైస్కూల్ కరస్పాండెంట్ కోటపాటి తిరుపతిరెడ్డి(97) బుధవారం మృతి చెందారు. స్థానిక పవిత్ర కళ్యాణ మండపం వీధిలోని గృహంలో కోటపాటి తిరుపతిరెడ్డి భౌతికకాయాన్ని పీడీసీసీబీ మాజీ చైర్మన్ వైఎం ప్రసాద్‌రెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ వైఎం సరితారెడ్డి సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పలువురు ప్రజా ప్రతినిధులు, రాజకీయ నాయకులు, పట్టణ ప్రముఖులు తిరుపతిరెడ్డి భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు.

పొగాకు కనిష్ట ధర రూ.120

కొండపి: స్థానిక పొగాకు వేలంకేంద్రంలో లో పొగాకు కనిష్ట ధరలు రోజు రోజుకు తగ్గుతున్నాయి. వేలం ప్రారంభంలో కనిష్ట ధర రూ.260 పలకగా పదో రౌండ్‌కు వచ్చే సరికి రూ.120కి పడిపోయింది. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. వేలానికి వచ్చే బేళ్లలో ఒకటి రెండు బేళ్లకు అధిక ధర వేసి మిగిలిన బేళ్లకు కనిష్ట ధర వేస్తున్నారని రైతులు వాపోతున్నారు. బుధవారం జగ్గరాజుపాలెం, ఎస్ఎస్‌కండ్రిక, పెట్లూరు, అయ్యప్పరాజుపాలెం, నరసరాజుపాలెం, పెదకండ్లగుంట గ్రామాలకు చెందిన రైతులు 805 బేళ్లను తీసుకురాగా 646 బేళ్లను కొనుగోలు చేసి 159 బేళ్లను తిరస్కరించారు.

టంగుటూరు: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో బుధవారం నిర్వహించిన వేలంలో గరిష్ట ధర రూ.313 పలికింది. వేలానికి క్లస్టర్ పరిధిలోని కారుమంచి, ఎం నిడమానూరు గ్రామాలకు చెందిన రైతులు 1011 బేళ్లను వేలానికి తీసుకురాగా 872 బేళ్లను కొనుగోలు చేశారు. కనిష్ట ధర రూ.125, సరాసరి ధర రూ.221.73గా నమోదైంది.

కార్మికులకు గుర్తింపుకార్డుల పంపిణీ

కనిగిరిరూరల్: ముఠా కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని సీఐటీయూ జిల్లా నాయకులు పీసీ కేశవరావు అన్నారు. బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఠా కార్మికుల ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని, 50 ఏళ్లు నిండిన వారికి పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు.ముఠా కార్మికులకు సీఐ ఎస్‌కే ఖాజావలి చేతుల మీదుగా గుర్తింపు కార్డులను పంపిణీ చేశారు.